రేపటి నుంచి ఉచిత కంప్యూటర్ తరగతులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ తరగతుల్లో భాగంగా ఫిబ్రవరి 3 నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభమవుతున్నాయని నిర్వాహకుడు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ సింగరి రాజ్‌కుమార్ తెలిపారు. అడ్వాన్స్ ఎక్సెల్, సీలాంగ్వేజ్, ఎంఎస్ ఆఫీస్ (బేసిక్స్) లలో ఉదయం, సాయంత్రం తరగతులు ఉంటాయని, విద్యార్థులు, మహిళలు, యువత, నిరుద్యోగులు సద్వినియోగపరచుకోవాలని, వివరాలకు ఫోన్ నంబరు 9866661588లో సంప్రదించవచ్చునని రాజ్‌కుమార్ తెలిపారు.

కృత్రిమ మేధపై ముగిసిన జాతీయ సదస్సు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో మెకానికల్, థర్మల్ ఇంజనీరింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషించనున్నదని ఎఫ్ఐఈ పూర్వ అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.నారాయణ అన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డ్రివెన్ డిజిటల్ ట్విన్స్ ఇన్ మెకానికల్ అండ్ థర్మల్ ఇంజనీరింగ్ సిస్టమ్స్ అనే అంశంపై రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ కృత్రిమ మేధను మానవ జీవితాలను అబ్బురపరిచేవిధంగా అనేక రకాలుగా వినియోగించుకోవచ్చునన్నారు. యువత ఎఐ పై దృష్టి సారించి వినూత్న ప్రయోగాలు చేయాలని సూచించారు. సదస్సుకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా తెలంగాణ ఛైర్మన్ డాక్టర్ జి.వెంకట సుబ్బయ్య అధ్యక్షత వహించగా కన్వీనర్‌గా ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ మోహినుద్దీన్, ఎఫ్ఐఈ కార్యదర్శి డాక్టర్ కె.సీతారాం బాబు, మాజీ ఛైర్మన్లు బ్రహ్మారెడ్డి, బానోతు రమణా నాయక్, ప్రతినిధులు డాక్టర్ ఐ సత్యనారాయణ రాజు, డాక్టర్ శ్యాం సుందర్, సుబ్బరాయుడు, రాజేశ్వరరావు, గోపాలరావు, జియావుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం

కేంద్ర బడ్జెట్‌పై నగరవాసుల స్పందన



బంజారాహిల్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టి బడ్జెట్‌పై భిన్న భిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మధ్య తరగతి, సామాన్యులకు మేలు చేసేలా ఉన్నా అవి కార్యరూపం దాల్చడం ఎప్పటికి సాధ్యం అవుతుందని అనేది తెలపకపోవడంపై నగర వాసులు పెదవి విరుస్తున్నారు. బస్తీలో ఉంటున్న వారికి, ఇళ్లు అద్దెకు తీసుకొని ఉంటున్న వారికి హౌసింగ్ స్కీమ్‌ను తీసుకువస్తున్నట్టు గతంలోనే కేంద్రం ప్రకటించింది. కాని దీనికి కావాల్సిన బడ్జెట్‌ను ఈ సారి కేటాయించలేదు. నిత్యావసరాల పెరుగుదల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఆదాయపు పన్ను 12 లక్షలకు పరిమితం చేయడం ఊరటనిచ్చే అంశం అయినప్పటికీ మహిళలు ఇష్టపడే బంగారంపై సుంకం విషయంలో మాత్రం కేంద్రం దాటవేసే ధోరణితో వ్యవహరించింది. రైతులకు మేలు చేసేలా బడ్జెట్ ఉన్నట్టు కొందరు అభిప్రాయపడుతున్నారు. బడ్జెట్ గురించి విశ్లేషిస్తే కొంచెం ఇష్టం.. కొంచెం కష్టమనే చెప్పవచ్చని నగర వాసులు అభిప్రాయపడుతున్నారు. వారి మాటల్లోనే...

గృహ విధానంతో మధ్యతరగతికి మేలు



మధ్య తరగతి ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఎంతో మేలు జరుగుతుంది. బస్తీల్లో. అద్దె ఇళ్లల్లో ఉండే వారి కోసం సొంతింటి కలను సాకారం కావడానికి ఎంతో మందికి ఉపయోగ పడుతుంది. గతేడాది పీఎం అవాస్ యోజన కింద 2 కోట్ల ఇళ్లను నిర్మించి పేదలకు అందచేస్తామన్నారు. తెలంగాణలో మాత్రం ఈ హామీ నెరవేరలేదు.

-లింగంపల్లి నర్సింగరావు, వ్యాపారి

మహిళా శక్తి పుంజుకుంది



పదేళ్ల బీజేపీ పాలనలో మహిళల సాధికారత బాగా వృద్ధి చెందింది. ఉన్నత చదువులు చదువుతున్న మహిళల సంఖ్య పదేళ్లలో 28 శాతం పెరగడం ఎంతో సంతోషంగా ఉంది. ట్రిపుల్ తలక్. పార్లమెంట్‌లో మహిళ లకు రిజర్వేషన్లు కల్పించడం. స్టాండప్ కంపెనీల కోసం నిధులు కేటాయించారు. ఇందులో మహిళలకు ప్రాధాన్యం ఇస్తే బాగుండేది.

- ఆకుల మంజుల, గృహిణి, బి.కె.గూడ

ట్యాక్స్ కట్టేవారికి శుభపరిణామం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పన్ను చెల్లింపు దారులకు శుభవార్త చెప్పారు. 2009-2010 ఆర్థిక సంవత్సరం వరకు పెండింగులో ఉన్న 25.వేల రూపాయలలోపు ట్యాక్స్ డిమాండ్లను విత్ డ్రా చేసుకుంటున్నట్లు ప్రకటన చేశారు. అలాగే 2011-2015 ఆర్థిక సంవత్సరం మధ్య 10 వేల లోపు ఉన్న వివాదాస్పద పన్ను డిమాండ్లను ఉపసంహరణ చేస్తున్నట్లు బడ్జెట్లో ప్రతిపాదన చేయడంతోకోట్ల మందికి ప్రయోజనం కలుగుతుంది

-రమేష్, ప్రైవేటు ఉద్యోగి, సనత్‌నగర్

కార్మికులకు గుర్తింపు లభించాలి



కార్మికులకు తగిన గుర్తింపు లభించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. కాని ఎవరూ పట్టించుకోలేదు. కేంద్రం దీనిపై స్పందించింది. గతంలో కార్మిక చట్టాన్ని పటిష్టం చేస్తామన్నారు. కాని అమలు కాలేదు. ఈ యేడాదైన అమలు జరుగుతుంతో చూడాలి. పనికి తగ్గ డబ్బులు వస్తాయి గతేడాది కూడా కేంద్రం ఈ అంశాన్ని ప్రతిపాదించింది. కాని అమలు కాలేదు. ఈ యేడాదైన అమలు చేస్తే కార్మిక కుటుంబాల్లో అనందం వెల్లి విరుస్తుంది.

- నీలిమ, గృహిణి



ప్రదర్శనను ప్రారంభిస్తున్న డాక్టర్ మాధవి చౌదరి

కళింగలో జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన

బంజారాహిల్స్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 లోని కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను సెలబ్రెటీ సీక్రెట్స్ ఫౌండర్ డాక్టర్ మాధవి చౌదరి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్ లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలేదన్నారు. నేటితరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని, ప్రతి ఒక్కరు చేనేతకారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ, ఈ నెల 9 వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.



సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న ఆలయ అధికారులు

జోగులాంబ బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): గద్వాల్ జోగులాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆలయ అధికారులు, అర్చకులు సీఎంను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో శనివారం కలిసి ఆహ్వానం అందించారు. ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్, ఆలయ అధికారులు సీఎంకు ఆహ్వానం అందించినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌కు ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం చేశారు.



మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గజ్జెల ఆనంద్

బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి: కేటీఆర్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు పుర్వవైభవం సాధించి రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ రామారావు ఆకాంక్షించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఖైరతాబాద్ అధ్యక్షుడు గజ్జెల ఆనంద్ నాయకత్వంలో ఖైరతాబాద్‌కు చెందిన పలువురు యువకులతో కేటీఆర్ పార్టీ పరిస్థితులపై తెలంగాణ భవన్‌లో చర్చించారు. నాయకులందరూ సమన్వయం తో పనిచేసి పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని కేటీఆర్ తెలిపారని, త్వరలోనే ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక రావడం ఖాయమని, అందులో పార్టీ సత్తా చూపాలని కోరినట్టు ఆనంద్ తెలిపారు.



నదీ వాక్యం కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, తదితరులు

నదీ వాక్యంలోని ప్రతి కవితా అద్భుతం

- **గవర్నర్ బండారు దత్తాత్రేయ**

పంజాగుట్ట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఓ జర్నలిస్టుగా రెహనా చూసిన సామాజిక అంశాలపై రాసిన నదీ వాక్యంలోని ప్రతి కవిత అద్భుతమని హరియణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం రాత్రి సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ హక్కు కమిషన్ సభ్యురాలు, జర్నలిస్ట్ రెహనా రచించిన నదీ వాక్యం కవిత సంపుటిని ఆయన మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్, కొమ్మినేని శ్రీనివాసరావు, నేమాని భాస్కర్, రచయిత యాకూబ్, వల్లీశ్వర్, కవి యాకుబ్‌లతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

నగరంలో 10 ప్రాంతాల్లో డే కేర్ సెంటర్లు

- **అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి**

అమీర్‌పేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం నగరంలోని 10 ప్రాంతాల్లో డే కేర్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని జీహెచ్ఎంసీ (యూసీడీ)అదనపు కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి వెల్లడించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సిటిజన్లకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన వారికి శనివారం బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. మోడల్‌కాలనీలోని సంస్కృతిక సామాజిక భవనంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలో ఆసరా సర్కిల్ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న వయోధిక కేంద్రాల కార్యకలాపాలను సావనీర్ ద్వారా తీసుకురావడం, ఇతరులకు మార్గదర్శంగా ఉండాలని సూచించారు. ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, అక్కినేని నాటకళాపరిషత్ ఛైర్మన్ సారిపల్లి కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు మొత్తం 9.6 కేజీల గంజాయి, 410 గ్రాముల హాష్ ఆయిల్, రూ.88,490 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బోరబండ ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు జరిపిన తనిఖీల్లో 1.19 కేజీల గంజాయి, మల్కాజిగిరిలో 1.77 కేజీ, వారాసిగూడలో 1.40 కేజీ గంజాయిని పట్టుకున్నారు. సంగారెడ్డిలో 5.40 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. సరూర్‌నగర్ పరిధిలో జరిపిన తనిఖీల్లో 410 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐదు కేసుల్లో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో మోసం

- నౌకరీ డాట్‌కామ్ ద్వారా ఉద్యోగాలిస్తున్నామని బురిడీ
- తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): నౌకరీ డాట్ కామ్ ద్వారా ఉద్యోగాలిస్తున్నాం అంటూ బురిడీ కొట్టించి. పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో నిరుద్యోగులను మోసం చేసి రూ.లక్షల్లో కాజేస్తున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు సైబర్ నేరగాళ్లను సిటీ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్‌కు చెందిన పాలడుగుల దేవ కృప, విజయవాడ చిట్టినగర్‌లో క్రిప్టో కన్వర్షన్ చేస్తున్న వివి శివ శంకర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న నార్సింగికి చెందిన బేతం బాలరాజు, కాళీమందిర్‌కు చెందిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎన్ఎస్ ప్రజ్వల్‌రెడ్డి, టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న మణికొండకు చెందిన విజయ్ సాగర్‌లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో నౌకరీ డాట్‌కామ్‌లో రెజ్యూమ్ అప్‌లోడ్ చేసిన నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకున్నారు. వారికి ఫోన్‌లు చేసి, నౌకరీ డాట్‌కామ్ ప్రతినిధులుగా పరిచయం చేసుకున్నారు. మేము మీకు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు కల్పిస్తామని, మేము పంపిన చిన్ని చిన్న టాస్కులు పూర్తి చేయడం, హోటళ్లకు రేటింగ్‌లు ఇవ్వడం, మంచి మంచి రివ్యూలు రాయడం, వాటిని షేర్ చేసిన తర్వాత మీ ఖాతాలో డబ్బులు వేస్తాము అంటూ నమ్మించారు. దాంతో అదంతా నిజమని నమ్మిన బాధితులు వారు చెప్పినట్లు చేశారు. మొదట్లో కొద్ది మొత్తంలో డబ్బులు జమ చేసిన నిందితులు తర్వాత కంపెనీ తరపున ఇన్వెస్టిమెంట్స్ చేసిన వారికి అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. అలా మెల్లగా వారిని ఊబిలోకి దింపారు. ఆ తర్వాత సాంకేతిక లోపం వల్ల మీ బ్యాంకు ఖాతా ఫ్రీజ్ అయిందని, మరో బ్యాంకు ఖాతా ఇస్తే డబ్బులు జమ చేస్తామని నమ్మించారు. అలా మరో బ్యాంకు తీసుకున్న తర్వాత మళ్లీ ఇన్వెస్టిమెంట్ చేయాలని ఒత్తిడి చేశారు.

ఇదంతా మోసమని భావించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ మధులత టీమ్ టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.

టాయిలెట్స్‌ను శుభ్రం చేయించాలి



బొల్లారం డౌటన్ బజార్‌లోని దుర్గంధం వెదజల్లుతున్న టాయిలెట్స్

తిరుమలగిరి ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం కంటోన్మెంట్ అధికారులు బొల్లారంలోని డౌటన్ బజార్‌లో టాయిలెట్స్‌ను ఏర్పాటు చేశారు. కానీ వాటి నిర్వహణను విస్మరించడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల రాకపోకలు కొనసాగించే పౌరులు, భూలక్ష్మమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు టాయిలెట్స్ నుంచి దుర్వాసన వస్తుండటంతో ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. దుర్గంధం వెదజల్లడంతో ఆ రహదారి గుండా ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. వాటిని శుభ్రం చేయించాలని కంటోన్మెంట్ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టాయిలెట్లు నిర్మించడమే మా వంతు నిర్వహణ తమది కాదనే రీతిలో అధికారులు వ్యవహరించడం బాధాకరమని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి టాయిలెట్స్‌ను శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టలోని శ్రీ మార్కండేయ శివ పంచాయతన దేవాలయంలో మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా సాగింది. పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు సంతోష్, ప్రధాన కార్యదర్శి చిలువేరి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు కండ్లవల్లి సత్తభూషణం, కోశాధికారి ఇప్పరపల్లి శ్రీనివాస్, సభ్యులు ప్రభాకర్, రామ్మూర్తి, శివాజీ, పెండెం మనోహర్, రాములు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు పూల మారుతిలు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

కేంద్ర బడ్జెట్‌పై నగర వాసుల స్పందన



సికింద్రాబాద్, చిలకలగూడ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి దోహదపడే నిధులు, ప్రాజెక్టులు కేటాయించకపోవడం పట్ల కొందరు అసంతృప్తి వ్యక్తం చేయగా, దేశ వ్యాప్తంగా మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడేలా 12 లక్షల రూపాయల వార్షిక ఆదాయం వరకు పన్ను లేకపోవడం, క్యాన్సర్ తదితర ఔషధాలకు పన్ను మినహాయించడం వంటి కారణాలతో బడ్జెట్‌పై కొందరు హర్షం వ్యక్తం చేశారు. వెరసి.. శనివారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ప్రభుత్వ స్కూళ్లల్లో బ్రాడ్ బ్యాండ్ హర్షణీయం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ స్కూళ్లల్లో బ్రాడ్ బ్యాండ్ సౌకర్యం కల్పించడానికి చర్యలు చేపట్టడం హర్షణీయం. పోటీ ప్రపంచంలో ఆధునిక టెక్నాలజీ వినియోగించుకుని విద్యా రంగంలో తమ ప్రతిభ మెరుగుపరచుకోవటానికి చక్కని అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకి మంచి అవకాశం. విధివిధానాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి.

- మల్లికార్జునరెడ్డి, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు, దూద్‌బావి

8వ వేతన సంఘం ఊసేలేదు

బడ్జెట్‌లో రైల్వేలకి ఎలాంటి ప్రాధాన్యమివ్వలేదు. కొత్త రైళ్లు, డబ్లింగ్ పనుల ఊసే లేదు. 8వ వేతన సంఘం ఏర్పాటు, కనీస వేతనం, స్తంభింప చేసిన కరువు భత్యం ప్రస్తావన లేదు. ఆదాయపు పన్ను పరిమితి పెంపు అంశం లక్షలాది ఉద్యోగులు, పెన్షనర్లకి ఉపయుక్తంగా ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య వందే భారత్ స్లీపర్ రైళ్లు ప్రవేశపెట్టడంపై ప్రకటన ఉంటే బాగుండేది.

- షేక్ రవూఫ్, ద.మ.రైల్వే ఎంప్లాయీస్ సంఘ్‌మీడియా ప్రతినిధి

సమ్మిళిత అభివృద్ధికి దోహదం చేయనుంది



పేదలు, యువత, రైతుల సమ్మిళిత అభివృద్ధికి ఈ బడ్జెట్ దోహదం చేయనుంది. మధ్య తరగతి వేతన జీవులకు ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.12 లక్షల వరకు పెంచడం ద్వారా గొప్ప ఉపశమనం లభించింది. హౌసింగ్ లోన్‌పై వడ్డీ మొత్తానికి తగ్గింపు ఉండకపోవడం కాస్త ఇబ్బంది. చిన్న వ్యాపారులకు ఈఎస్ఐ, పీఎఫ్ వాటాలో మద్దతు కావాలి. భారతీయ వస్తువులను విక్రయించే వ్యాపారులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. డిజిటల్ చెల్లింపులను అమలు చేసే వ్యాపారులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి


- అమ్మనబోలు ప్రకాష్, టీఎస్ఎఫ్‌సీసీటీ అధ్యక్షుడు

ధరలు పెంచలేదు

బడ్జెట్‌లో ఎటువంటి ధరల పెంపు లేదు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు వినియోగించే గ్యాస్ ధర పెంచకపోవడం హర్షణీయం. నిత్యావసర వస్తువుల ధరలపై కూడా బడ్జెట్ ప్రభావం ఉండకపోవచ్చని ఆశిస్తున్నాను. వంట నూనెలు, పప్పుల ధరల నియంత్రణకి చర్యలు చేపట్టవలసిన అవసరముంది. వీటి ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అన్నదాతల కోసం చేపట్టిన చర్యలు, ఆదాయపు పన్ను పెంపు వల్ల ఉద్యోగులకి ఊరట మంచి పరిణామం. మొత్తం మీద ఈ సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనలు బాగునాన్నాయి.

- అరుణ కుమారి, కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి

నిరాశాజనకం



కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది. ప్రభుత్వ ఆస్తులు అమ్మకానికి పెట్టి ప్రైవేటైజేషన్ దిశగా చర్యలు చేపడుతున్నట్లుగా ఉంది. కొత్త పరిశ్రమలు, ఫ్యాక్టరీల స్థాపన ఉద్యోగాల సృష్టి ప్రస్తావనలేదు. నిత్యావసర వస్తువుల నియంత్రణకి చర్యలు లేవు. రైల్వేలోని భద్రత రంగంలో ఉద్యోగాల భర్తీని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. 18నెలల కరువు భత్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలి.

- మర్రి రాఘవయ్య, ద.మ.రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి

కోట్లలో లాభాలు.. వాటాలు ఇస్తానని మోసం

● పెట్టుబడుల పేరుతో రూ.లక్షలు కాజేసిన నిందితుడి అరెస్టు



హిరన్మహి

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కోట్లలో లాభాలు.. కంపెనీలో వాటాలు ఇస్తానని నమ్మించి.. తన సంస్థలో పెట్టుబడులు పెట్టించి రూ.లక్షల్లో దండుకుని కనిపించకుండా పోయిన ఘరానా మోసగాడిని సీసీఎస్, నార్త్ జోన్ టాస్క్‌పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ గాంధీనగర్‌కు చెందిన కశ్వరాజు హిరన్మహి 2021లో రేషన్ బయో ప్రొడక్టు పేరుతో ఒక కంపెనీ స్థాపించాడు. ఎలాంటి కెమికల్స్ లేకుండా ఫ్లోర్స్, వాష్‌రూమ్స్ క్లీనింగ్ చేసే ద్రావణాన్ని సరఫరా చేస్తానని హామీ ఇచ్చాడు. పెట్టుబడులు పెట్టినవారికి ఫ్రాంఛైజీ ఇవ్వడంతో పాటు రూ.కోట్లలో లాభాలు, సంస్థలో వాటా ఇస్తానని వాగ్దానం చేశాడు. 2024 వరకు రూ.వందకోట్ల టర్నోవర్ సాధిస్తామని నమ్మబలికాడు. ఈ క్రమంలో పలువురు అతడి సంస్థలో లక్షల్లో పెట్టుబడులు పెట్టారు. అలా కోట్లు వసూలు చేసిన హిరన్మహి పెట్టుబడిదారులను మోసం చేసి, కంపెనీ ప్రొడక్టులను ఇతర మార్గాల ద్వారా అమ్ముకున్నాడు. అంతేకాకుండా పెట్టుబడుదారులకు నిలువునా ముంచేశాడు. కొంతమందికి ఇచ్చిన ప్రొడక్టులను వివిధ రకాల కెమికల్స్ వినియోగించి తయారు చేసిన లిక్విడ్‌గా తేలింది. దీంతో బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడిని సీసీఎస్, నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో శనివారం అరెస్టు చేశారు. ఈ మేరకు సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి, కుమారుడి అదృశ్యం




కళ్యాణి, కుమారుడు రేహాన్స్

అడ్డగుట్ట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): నానమ్మ ఇంటికి వెళుతున్నానని చెప్పిన తల్లి, కుమారుడు అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం ఈస్ట్ మారేడుపల్లికి చెందిన శ్రీనివాస్ భార్య లావణ్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. రెండేళ్ల కుమారుడు రేమాన్స్ సంతానం. గత నెల 30న నానామ్మ ఇంటికి వెళుతున్నానని తన భర్తకు ఫోన్ చేసి ఇంటి నుంచి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత భర్త భార్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి ఉంది. అతడు వెంటనే అత్తకు ఫోన్ చేసి లావణ్య గురించి వాకబు చేశాడు. ఇక్కడికి లావణ్య రాలేదని అత్త చెప్పడంతో భర్త బంధువుల ఇళ్లలో వాకబు చేశాడు. ఫలితం లేకపోవంతో జనవరి 31న తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో భార్య, కుమారుడు కనబడటం లేదని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లావణ్య, రేహాన్స్‌లపై మిస్సింగ్ కేసు కింద నమోదు చేశామని సీఐ తెలిపాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గ్రేటర్ ఆర్టీసీ ఇన్‌చార్జి ఈడీగా రాజశేఖర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ ఆర్టీసీ/ హైదరాబాద్ జోన్ ఇన్‌చార్జి ఈడీగా సికింద్రాబాద్ ఆర్ఎం రాజశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్ శుక్రవారం పదవీవిరమణ చేయడంతో సికింద్రాబాద్ ఆర్ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజశేఖర్‌కు ఇన్‌చార్జి ఈడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఆపరేషన్ స్మైల్‌లో 924 మంది చిన్నారుల గుర్తింపు

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 924 మంది చిన్నారులను గుర్తించారు. జనవరి 1 నుంచి 31 వరకు జరిగిన ఆపరేషన్ స్మైల్ 11వ విడతలో ప్రత్యేక బృందాలు కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. ముఖ్యంగా పరిశ్రమలు, ఇతర వ్యాపార సంస్థల్లో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించడం, అదేవిధంగా రోడ్లపై బిక్షాటన చేసే చిన్నారులను గుర్తించడం వంటివి చేసి నెల రోజుల వ్యవధిలో 924 మందిని గుర్తించారు. బాల కార్మికుల్లో 843 మంది బాలురు, 61 మంది బాలికలు ఉన్నారు. ఇతరులు మరో 20 మంది వరకు ఉన్నారు. ఆపరేషన్‌లో స్మైల్ 11వ విడతో మొత్తం 10 కేసులు నమోదు చేసినట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మహిళా, శిశు రక్షణ విభాగం డిప్యూటీ కమిషనర్ కె.సృజన తెలిపారు.

ముగిసిన గణేష్ దేవాలయ బ్రహ్మోత్సవాలు



పూజల్లో పాల్గొన్న పుష్పగిరి శంకరాచార్యులు

బోయిన్‌పల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆరో వార్డులోని భావనకాలనీలోని గణపతి దేవాలయంలో 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడురోజులపాటు వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉద్యమ మహాగణపతి పూజ, కలశ స్థాపనతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం శివపార్వతుల కళ్యాణం, పూర్ణాహుతితో ముగిసాయి. శనివారం జరిగిన బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకలకు పుష్పగిరి మహాసంస్థానం జగద్గురు పుష్పగిరి శంకరాచార్య, శ్రీమత్ అభినవోద్దండ విద్యా శంకర భారతీస్వామి పాల్గొని చివరిరోజు చేపట్టిన పూజా కార్యక్రమాలలో శ్రీ గణేష్ పంచామృత అభిషేకం, గణేశహవనం, బలిప్రధానం, పూర్ణాహుతి ప్రవచనం, అనంతరం శివపార్వతుల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి బోయిన్‌పల్లి చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తరువాత ఆలయ కమిటీ అన్నప్రసాదాల వితరణ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను నిర్వహించిన ఆలయ కమిటీకి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు బానుక నర్మద మల్లికార్జున్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

జీఎస్టీ స్లాబులను సులభతరం చేయాలి



టిఎస్ఎఫ్‌సీసీటీ అధ్యక్షుడు అమ్మనబోలు ప్రకాష్, వరకుమార్ గుప్తా, నరేందర్, గోవింద్

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ స్లాబులను సులభతరం చేయాలని తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ రాష్ట్ర అధ్యక్షులు అమ్మనబోలు ప్రకాష్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో టీఎస్ఎఫ్‌సీసీటీ విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేస్‌లెస్ ఇన్‌కం టాక్స్ రిటర్న్స్ మూలంగా, రిటర్న్స్ దాఖల వల్ల ట్రేడర్స్‌కు ఉన్న ఇబ్బందులు తొలగాయని అందుకు ప్రధాని, ఆర్థికశాఖ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. పేదలు, యువత, రైతుల సమ్మిళిత అభివృద్ధికి ఈ బడ్జెట్ దోహదం చేయనుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పారిశ్రామిక వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారన్నారు. దేశవ్యాప్తంగా సర్వీస్ సెక్టార్ 4.5 జీడీపీ కలిగి ఉందన్నారు. ఈకామర్స్ వల్ల చిన్న ట్రేడర్స్‌పై తీవ్ర ప్రభావం ఉందని దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్న, మధ్యతరహా ట్రేడర్స్‌కు రైతులకు ఇచ్చే మాదిరిగా ఇన్సెంటీవ్‌లతోపాటు రుణాలను ఇవ్వాలని, రుణ పరిమితులను పెంచాలని కోరారు. వర్కింగ్ క్యాపిటల్ టర్మ్‌లోన్లపై వడ్డీ రేట్ల తగ్గింపు ఉండాలని, ఆన్‌లైన్ వాణిజ్య (ఈకామర్స్) సంస్థలు తక్కువ ధరకే ఉత్పత్తులను విక్రయించే విధానాన్ని నియంత్రించేందుకు చట్టపరమైన రక్షణ అవసరమన్నారు. తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రభుత్వం రాయితీలు ఇస్తున్నందువల్లే దేశంలోనే ఎలక్ట్రిక్ వాహనాలకు హబ్‌గా తెలంగాణ నిలిచిందని, ఎక్కువ మొత్తంలో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు వరకుమార్ గుప్తా, కార్యదర్శి నరేందర్, సభ్యులు గోవింద్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): జంట నగరాలకు చెందిన మున్నూరు కాపు విద్యార్థినీ, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు సికింద్రాబాద్ కాపుసంఘం ట్రస్టుబోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. ఇంటర్మీడియేట్, డిగ్రీ, పాలిటెక్నిక్, మెడిసిన్, ఇంజనీరింగ్, లా, అగ్రికల్చర్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ, యానిమల్ హస్బెండరి తదితర విద్యను అభ్యసిస్తున్నవారు అర్హులని వారు తెలిపారు. దరఖాస్తుదారులు గత పరీక్షల్లో 75 శాతం కంటే అధికంగా మార్కులు సాధించి వెనుకబడిన, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తామని వారు తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి దరఖాస్తులను ఎంజీ రోడ్డు చర్చ్ పక్కన ఉండే సికింద్రాబాద్ కాపుసంఘం కార్యాలయం నుంచి పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను 25వ తేదీ లోపు అందించాలని సూచించారు. దరఖాస్తుతోపాటు కుల ధృవీకరణ, బోనఫైడ్, ఆదాయ ధృవీకరణ పత్రం, మార్కుల మెమో, అడ్రస్ ప్రూఫ్‌లు అందించాలన్నారు. వివరాలకు ఆఫీస్ ఇన్‌చార్జి పట్టెం సుదర్శన్‌రావును లేదా 040 27849399, 8500660334 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మట్టి కుప్పలను తొలగించాలి



ఇందిరాల క్ష్మీనగర్ బస్తీలో పేరుకుపోయిన మట్టికుప్ప

అడ్డగుట్ట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్ ఇందిరా లక్ష్మీనగర్ లోని మహంకాళి అమ్మవారి ఆలయం పక్కనే గత కొంత కాలంగా మట్టి కుప్పలను జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించకపోవడంతో ఆలయానికి వచ్చే భక్తులతో పాటు రాకపోకలు సాగిస్తున్న ప్రజలకు ఇబ్బందిగా మారింది. జీహెచ్ఎంసి సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. వెంటనే మట్టి కుప్పను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.